



అప్పుడు నాటుడు.. ఇప్పుడు నరుకుడు..

రామంతాపూర్: ఓ వైపు జీహెచ్‌ఎంసీ పరిధిలోని పార్కుల్లో రూ.లక్షల నిధులు వెచ్చించి మొక్కలు నాటుతుంటే.. మరో వైపు పార్కుల్లో భారీగా పెరిగిన పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికి వేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. హరితహారం పేరుతో పెద్దఎత్తున మొక్కలు నాటుతుంటే.. ఏదో సాకులు చెప్పి పెద్ద చెట్లను నరికివేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ ప్రగతినగర్‌లోని పార్కులో ఒకప్పుడు పెద్దఎత్తున మొక్కలను నాటారు.. అవి పెరిగి ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారింది. గురువారం కొందరు భారీగా పెరిగిన చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికేశారు. దీంతో విషయం తెలుసుకున్న కొంతమంది స్థానికులు అక్కడికి చేరుకుని వారిని నిలదీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. పార్కులో గడ్డి ఏర్పాటు చేసేందుకు చెట్ల కొమ్మలను నరికివేసినట్లు చెప్పారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి చెట్లు కొట్టేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రియులు, స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ బీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీజేఆర్‌నగర్, సత్తిరెడ్డినగర్, సత్య రాఘవేంద్ర కాలనీ, వసంతపురికాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 వరకు షావాలెస్ గల్లీ, ఓల్డ్ పోస్టాఫీస్ ప్రాంతం, 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 వరకు సాయంత్రం 7 గంటల వరకు యాదవ్‌నగర్, మధుసూదన్‌నగర్, సంజయ్‌నగర్ కాలనీ, ఓల్డ్ మల్కాజిగిరి, గీతానగర్‌లో సరఫరా ఉండదని ఏఈ సుదీప్‌రెడ్డి తెలిపారు.

మరమ్మతుల కారణంగా..

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో సరఫరా నిలిచిపోనున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. ఈశ్వర్‌పురి, కల్యాణ్ గార్డెన్, సైనిక్‌పురి, హైటెన్షన్ లైన్ ఫీడర్ల పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈశ్వరపురి, కల్యాణ్ గార్డెన్ ఫీడర్ల పరిధిలోని ఈశ్వరపురి కాలనీ, భాస్కర్‌రావునగర్, లేక్ వ్యూ రెసిడెన్సీ, సైనిక్‌పురి, హస్తినాపురం, నిర్మల్ నగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సైనిక్‌పురి, హైటెన్షన్ ఫీడర్ల పరిధిలోని సైనిక్‌పురి, వాయుపురి, నేతాజీనగర్, అశోక్ ఎన్‌క్లేవ్, ప్రథమపురి కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు.

విద్యార్థులకు మిల్లెట్స్‌పై అవగాహన

ఉప్పల్: పోషణలో భాగంగా గురువారం చిలుకానగర్‌లోని ఎంపీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల కిషోర బాలికలకు మిల్లెట్స్‌పై అవగాహన కల్పించారు. అల్వాల్ ప్రాజెక్ట్ అధికారిణి డి.స్వాతి హాజరై విద్యార్థులకు మిల్లెట్స్ ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అక్రమంగా పార్కింగ్ చేస్తే చర్యలు

బోడుప్పల్: ఎక్కడ పడితే అక్కడ లారీలు అక్రమంగా పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. చెంగిచర్ల చింతల చెరువు పక్కన చెరువు స్థలంలో లారీలను అక్రమంగా పార్కింగ్ చేయడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ వెంటనే అక్కడ నుంచి లారీలను ఖాళీ చేయించి కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా రోడ్డు పక్కన అక్రమంగా పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటును వినియోగించుకోవాలి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో ఓటు నమోదు, తప్పొప్పుల సవరణ శిబిరాన్ని గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్ కోసం సమర్థులైన వారిని ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓటును ఉపయోగించుకోవాలని ఓటర్ల లిస్టులో పేరు లేని వారు వెంటనే నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు స్రవంతి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన ఘటన గురువారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండ్రెడ్డి కృష్ణప్రసాద్ ప్రిటింగ్ వ్యాపారం చేసుకుంటూ చర్లపల్లి, ఈసీనగర్‌లో భార్య లక్ష్మీ అలియాస్ భాగ్యలక్ష్మీ, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ర్త ఇంట్లో కనిపించక పోవడంతో భార్య లక్ష్మీ అప్పటికే భర్త ఆచూకీ కోసం వెతుకుతుండగా విషయం తెలియడంతో చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లింది. మృతుడు తన భర్తగా గుర్తించి కన్నీటి పర్యంతమైంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



గణేష్ ఉత్సవాలపై కాప్రా సర్కిల్ కార్యాలయంలో సమీక్ష



అల్వాల్‌లో సమీక్ష సమావేశంలో ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కాప్రా: అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. గణేష్ ఉత్సవాలపై గురువారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం, ఇతర అంశాలపై అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులన్నీ కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్లు శిరీషరెడ్డి, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్‌ఎస్ నేతలు ధన్‌పాల్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, పజ్జూరి పావనీరెడ్డి, మున్సిపల్, జలమండలి, పోలీసు సిబ్బందితో పాటు భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు అండ

హబ్సిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు అండగా నిలుస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతులమీదుగా చెక్కులను అందజేశారు.

నిమజ్జనం ఏర్పాట్లపై ఉపకమిషనర్ సమీక్ష

అల్వాల్: సర్కిల్ పరిధిలోని జరిగే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పోలీస్ అధికారులు, విద్యుత్ రెవెన్యూ ఆర్‌అండ్‌బీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, హార్టికల్చర్‌లతో సహా అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరిగే విధంగా ప్రతి డిపార్ట్‌మెంట్ సహకరించాలని ఆయన కోరారు. ప్రజలు కూడా ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని గణపతి నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ సహకారంతో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలియజేశారు. సీఐ ఉపేందర్‌రావు, జలమండలి అధికారి సాంబయ్య, శానిటేషన్ అధికారిని మంజుల, ఎలక్ట్రికల్ ఏఈ స్వాతి, నవీన్, మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పాండ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంతంగా జరుపుకోవాలి

అల్వాల్: అల్వాల్‌లోని కొత్త చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన పాండ్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎలక్ట్రికల్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి దీక్ష భగ్నం కక్షపూరిత చర్య



ఉప్పల్ చౌరస్తా వద్ద బీజేపీ నేతల నిరసన



అల్వాల్ సర్కిల్‌లో..

ఉప్పల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్ష భగ్నాన్ని నిరసిస్తూ గురువారం ఉప్పల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఉప్పల్ అధ్యక్షుడు రెడ్డిగారి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాంతియుతంగా కొనసాగుతున్న దీక్షను పోలీసులు దౌర్జన్యంగా భగ్నం చేయడం కక్షపూరిత చర్యగా భావిస్తున్నామన్నారు. ప్రశ్నిస్తే అరెస్టు చేయడం బీఆర్‌ఎస్ నైజమని విమర్శించారు. కార్యక్రమంలో శామీర్‌పేట ధర్మారెడ్డి, రావుల బాలకృష్ణ, శిల్పారెడ్డి, మారినేని ఫణిందర్, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ సర్కిల్‌లో బీజేపీ నిరసన

అల్వాల్: రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై ఒక్కరోజు ఉపవాస దీక్ష చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా అల్వాల్ సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



గోపిని సన్మానిస్తున్న మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న హిందీ అధ్యాపకులు డాక్టర్ ఎం.గోపి ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తోటి అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

అమావాస్య అన్నదానంతో పుణ్యఫలం



రామంతాపూర్: ప్రధాన రహదారిలోని పోచమ్మ దేవాలయం వద్ద గురువారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్–మల్కాజిగిరి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమావాస్య రోజు అన్నదానం చేస్తే పుణ్య ఫలం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతి అమావాస్యకు వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సంబు పాండయ్య గుప్తా, శ్రీనివాస్, గట్టు ప్రకాష్, వెంకటేష్ గుప్తా, నగేష్, రవి, ప్రకాష్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

హిందీ భాషపై ప్రావీణ్యం ఉండాలి



హిందీ దివస్ కార్యక్రమంలో విద్యార్థులు

బోడుప్పల్: తెలుగు భాషతో పాటు ఇతర భాషల పట్ల విద్యార్థులు ప్రావీణ్యత కలిగి ఉండాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు గేయాలను ఆలపించారు. విద్యార్థులు నాటకం ద్వారా హిందీ భాష గొప్పదనాన్ని తెలియజేశారు. పలువురు విద్యార్థులు దేశభక్తి గేయాలను పాడి వినిపించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడీ శ్రీనివాస్‌గౌడ్ సేవలు మరువలేనివి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజవకవర్గంలో నిబద్ధత గల నాయకుడిని కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం గాంధీపార్కులో దివంగత జి.డి.శ్రీనివాస్‌గౌడ్ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా పార్టీకి సేవలందించిన ఘనత శ్రీనివాస్‌గౌడ్‌కు ఉందన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అఖిల పక్ష నాయకులు కార్పొరేటర్ శ్రవణ్, వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మండల రాధాకృష్ణయాదవ్, పిట్టల శ్రీనివాస్, ఉమేష్‌సింగ్, గుత్తి రాంచందర్, వినోద్‌యాదవ్, సానాది శంకర్, అలీ, వంశీ, శ్రీనివాస్‌యాదవ్, చాకో తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నందికంటి శ్రీధర్

ఆర్టీసీ ఉజ్వల భవిష్యత్‌కు ఉద్యోగులు కృషి చేయాలి

బోడుప్పల్: చెంగిచర్ల ఆర్టీసీ డిపోను ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. బస్సుల పరిశుభ్రత, వాషింగ్, స్వీపింగ్ పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతి ఉద్యోగి కష్టపడి పని చేయాలన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ సకాలంలో వారి గమ్యస్థానాలకు చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్లు సత్యన్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి



వీఎస్‌రెడ్డినగర్‌లో రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ వీఎస్‌రెడ్డినగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టే క్రమంలో తవ్వేసిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గుంతలమయంగా మారిన రోడ్డు దుస్థితితో నిత్యం ఇబ్బందులు పడుతున్నామంటూ కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె గురువారం కాలనీని సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి రోడ్ల సమస్యను పరిశీలించారు. త్వరగా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కనకరాజుగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి మెడిసిన్ చదువుకు బీఎల్‌ఆర్ ట్రస్టు చేయూత

కుషాయిగూడ: ప్రభుత్వ కళాశాలలో మెడిసిన్ సాధించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ పేద విద్యార్థినికి బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కైలాసగిరికి చెందిన బొడ్డు అశ్విని నల్లగొండ జిల్లా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. పేదరికం కారణంగా కళాశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. విషయాన్ని బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి అశ్విని చదువు బాధ్యతను పూర్తిగా తానే చూసుకుంటానని హామీ ఇచ్చారు. 5 సంవత్సరాల ఫీజును చెల్లిస్తానని మొదటి విడతగా ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో మెడిసిన్ సీటు సాధించే పేద విద్యార్థులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, వంజరి ప్రవీణ్, కరుణాకర్ మేరు తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి



మేయర్ విజయలక్ష్మితో బండారి లక్ష్మారెడ్డి



వంశ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో బండారు లక్ష్మారెడ్డి

కాప్రా: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని గురువారం ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజవకర్గంలోని తాజా పరిస్థితులపై మేయర్‌కు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరడంతో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఉన్నతాధికారులకు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నగర కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్‌శేఖర్, బన్నాల గీత ప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గంధం జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వంశరాజుల సంక్షేమానికి కృషిచేస్తా

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గురువారం రామంతాపూర్‌లోని కేసీఆర్‌నగర్ వంశరాజ్ సంక్షేమ సంఘం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో వెనుకబడి ఉన్న వంశరాజ్ సామాజిక వర్గ సంఘ భవనానికి స్థలం కేటాయించేలా కృషి చేస్తానని, అదేవిధంగా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. బీఆర్‌ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, వంశరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంశరాజ్ మల్లేష్, స్థానిక అధ్యక్షుడు చిటికల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పాయసం గోపాల్, సభ్యులు బాలస్వామి, తిరుపతయ్య, నరసింహ, కృష్ణ, వెంకటయ్య, చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో రూ.కోటి 20 లక్షలతో నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులను గురువారం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ స్థానికులతో కలిసి పరిశీలించారు. బ్యాంక్ కాలనీ నుంచి జహీర్‌నగర్ వరకు సరైన డ్రైన్ లేక స్థానికులు అనేక సంవత్సరాలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరేది. సమస్యను స్థానికుల ద్వారా తెలుసుకుని బాక్స్ కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. బీరప్పగడ్డ, సర్వే ఆఫ్ ఇండియా ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీరు నేరుగా డ్రైన్ ద్వారా వెళ్లిపోతోందని తెలిపారు. ఇందుకు దాదాపుగా రూ.కోటి 20 లక్షలకు పైగా వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ఏఈ రాజ్‌కుమార్, ఎద్దుల కొండల్ రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ కాలనీలో నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రజిత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరుతూ గురువారం ఏ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ గురించి వివరిస్తూ ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. న్యూభరత్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో పర్యటించారు. బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య, నుసం రఘునాథ్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు షురూ

మల్లాపూర్: ఎర్రకుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువులోని గుర్రపు డెక్క, చెత్తను తొలగించేందుకు ఎఫ్‌టీసీ యంత్రాన్ని తెప్పించామన్నారు. ఎంటామలజీ సూపర్‌వైజర్ నరసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, దాసరి కర్ణ, మంగోల్ శివ, అంజి, రాంచందర్, శివదత్తు, కృష్ణ పాల్గొన్నారు.



దంత సంరక్షణపై ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్: సమాజ శ్రేయస్సు కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి శాఖ సేవలు అందిస్తోందని క్లబ్ అధ్యక్షుడు దొంతి శ్రీనివాస్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ లిల్లీ మోడల్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి శాఖ, తార్నాకకు చెందిన మాక్స్‌కేర్ డెంటల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు దంత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. దంత వైద్యురాలు అలియా ఆఫ్రిన్, పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ షకీల్ అహ్మద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, రవీంద్రనాథ్ గుప్తా, సాంబశివరావు, శ్రీనివాస్ గుప్తా, రాములు, అభిజిత్, న్యూలిల్లీ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మద్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.



న్యూలిల్లీ మోడల్ స్కూల్‌లో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు అలియా ఆఫ్రిన్